www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 89 | హైదరాబాద్ | మంగళవారం | 17-06-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## మాజీ మంత్రి హరీశ్‌రావుకు స్వల్ప అస్వస్థత

తెలంగాణ మాజీ మంత్రి హరీశ్‌రావు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. జ్వరంతో ఆయన సికింద్రాబాద్ సన్ సైన్ ఆస్పత్రిలో చేరారు. ఇవాళ సాయంత్రం తెలంగాణ భవన్‌లోనే ఆయన స్వల్ప అస్వస్థతకు గురైనట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.



## కేటీఆర్ కు మద్దతుగా నిలిచిన కవిత

- కేటీఆర్ పై ఏసీబీ విచారణ నేపథ్యంలో కవిత మద్దతు
- ప్రధాన సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికే విచారణలంటూ ఆరోపణ
- తమ పార్టీ నేతలు, కార్యకర్తలను అడ్డుకుంటున్నారని మండిపాటు



2

## మోదీకి సైప్రస్ అత్యున్నత పురస్కారం

- సైప్రస్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన
- అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలెడెస్ తో ద్వైపాక్షిక అంశాలపై చర్చలు
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై ఇరువురు నేతల ఆందోళన
- ప్రధాని మోదీకి సైప్రస్ అత్యున్నత పౌర పురస్కారం ప్రదానం
- రక్షణ, వాణిజ్యం, సాంకేతిక రంగాల్లో సహకారంపై దృష్టి



3

# కేటీఆర్ సెల్ ఫోన్ సీజ్‌కు ఏసీబీ యత్నం



- ఫార్ములా ఈరేసు కేసులో కేటీఆర్‌ను ఏసీబీ సుదీర్ఘ విచారణ
- కేటీఆర్ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకునేందుకు అధికారుల యత్నం
- విచారణకు ఫోన్ తీసుకురాలేదన్న కేటీఆర్, 18లోపు ఇవ్వాలని ఆదేశం
- రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు, జైలుకు పంపాలని చూస్తున్నారంటూ ఆరోపణ

### జైలుకు పంపిస్తే విశ్రాంతి తీసుకుంటానన్న కేటీఆర్

**హైదరాబాద్ జూన్ 16(సిద్దిపేట పవర్):** చిట్టినాయుడు రాసిచ్చిన ప్రశ్నలు తప్పా ఏం విషయం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. ఫార్ములా ఈ రేసులో ఆయన ఏసీబీ విచారణకు హాజరయ్యారు. అనంతరం తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌కు వచ్చిన నేతలతో మాట్లాడారు. కేటీఆర్ మాట్లాడుతూ.. 'ఈ ఫార్ములా కార్ రేస్‌పై చర్చ పెట్టాలని అడిగితే రేవంత్‌రెడ్డి పారిపోయిండు. ఫార్ములా ఈ రేస్‌పై నేనేదో తప్పు చేసిన.. కేసీఆర్ ప్రభుత్వం ఏదో తప్పు చేసిందని అంటున్నవ్ కదా.. దమ్ముంటే చర్చపెట్టు అసెంబ్లీలో పట్టుపడితే పారిపోయిండు. నాలుగు గోడల

...మిగతా 3లో

## దళిత గిరిజన విద్యార్థులకు ధోకా?


- బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌లో రూ.210 కోట్లు బకాయిలు
- స్కీమ్ అమలుకు పాఠశాల యాజమాన్యాల నిరాకరణ
- ఈ విద్యాసంవత్సరం అడ్మిషన్లు ఇవ్వబోమని స్పష్టీకరణ
- దిక్కుతోచని 25 వేల మంది దళిత, గిరిజన విద్యార్థులు



2

## తొమ్మిదేళ్లుగా 'పెండింగే'

- 2015–16లోనే 56 కొత్త ఎక్సైజ్ భవనాల నిర్మాణానికి అనుమతులు
- ఇప్పటివరకు పూర్తయినవి 18 మాత్రమే.. అందులోనూ 10 స్టేషన్లే వినియోగంలోకి
- రూ.3 కోట్ల పెండింగ్ బిల్లులు... ఆ నిధులివ్వాలని ప్రభుత్వానికి ఎక్సైజ్ శాఖ ప్రతిపాదన
- 14 కొత్త ఎక్సైజ్ స్టేషన్ల ప్రారంభం ప్రతిసారీ వాయిదానే




2

# పాలిపోతున్న పచ్చదనం.. హరితహారాన్ని ఎత్తివేసిన సర్కారు

- సర్కారు నిర్లక్ష్యం.. పల్లెలకు శాపం
- వనమహోత్సవానికి మంగళం
- ఆనవాళ్లను కోల్పోతున్న నర్సరీలు
- నిధుల లేమితో నిర్వహణ కరువు
- కేసీఆర్ హయాంలో అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు విశేష కృషి



2

## ఇదికదా ప్రజా ప్రభుత్వం అంటే

- రైతును రాజుగా చేయడమే కాదు.. వ్యవసాయాన్ని పండగా చేస్తాం..
- రైతుల ఆశీర్వాదం ఉంటేనే పాలకుల కుర్చీలు పదిలంగా ఉంటాయి..
- వరి వేస్తే ఉరేసుకోవాల్సిందే అని గత ప్రభుత్వాధినేత చెప్పారు..
- రూ. 17 వేల కోట్లు మాత్రమే గత ప్రభుత్వం మాఫీ చేసింది: సీఎం రేవంత్ రెడ్డి



3

## కేటీఆర్ ఒక వ్యక్తి కాదు శక్తి

- హామీలిచ్చి మాటతప్పిన రేవంత్ రెడ్డిపై కేసు పెట్టాలి
- కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కమీషన్లను ఎత్తిచూపితే, ప్రశ్నిస్తే కేసులు
- స్థానిక ఎన్నికలకు ముందు కేసులతో చిల్లర రాజకీయాలు
- మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు



2

## కేటీఆర్ జైలుకు వెళ్లాలని కుతూహలంగా ఉన్నారు..


- కార్యకర్తల మీటింగ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక వ్యాఖ్యలు
- ఎన్నికల విషయంలో త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం
- కేటీఆర్ జైలుకు వెళ్లాలని కుతూహలంగా ఉన్నారు.
- వీలైనంత త్వరగా జైలుకు పంపించాలని మా సీఎంను రెచ్చగొడుతున్నారు.
- కేటీఆర్ పొగరుతో మాట్లాడుతున్నాడు



3

## కొత్త పంచాయతీల ఏర్పాటుకు బ్రేక్!.. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లూ కూడా కష్టమే!

### కేంద్రం నిర్ణయంతో తాత్కాలిక బ్రేక్




2



# దళిత గిరిజన విద్యార్థులకు ధోకా?

- బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌లో రూ.210 కోట్లు బకాయిలు
- స్కీమ్ అమలుకు పాఠశాల యాజమాన్యాల నిరాకరణ
- ఈ విద్యాసంవత్సరం అడ్మిషన్లు ఇవ్వబోమని స్పష్టీకరణ
- దిక్కుతోచని 25 వేల మంది దళిత, గిరిజన విద్యార్థులు

**హైదరాబాద్ జూన్ 16(సిద్దిపేట పవర్):**

కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో బెస్ట్ అవైలబుల్ స్కీమ్ (బీఏఎస్) పథకం కూడా ప్రశ్నార్థకంగా మారింది. ప్రైవేట్ స్కూళ్లకు సర్కారు రూ. 210 కోట్లు బాకీపడింది. నిధులు చెల్లించకుండా పథకం అమలు చేయడం కుదరదని పాఠశాల యాజమాన్యాలు స్పష్టంచేశాయి. దీంతో 25వేల మంది విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందని, ప్రభుత్వం నుంచి స్పందన కరువైందని, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు మండిపడుతున్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం.. విద్యపై నిర్లక్ష్యం**

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యను ఉచిత అందించడం కోసం 17 ఏండ్లుగా ప్రభుత్వాలు బెస్ట్ అవైలబుల్ స్కూల్' స్కీమ్ అమలు చేస్తున్నాయి. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖలు నోటిఫికేషన్ జారీచేసి, విద్యార్థులను ఎంపిక చేసి, అదే జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లల్లో చదివిస్తాయి. ఎస్సీ విద్యార్థులకు 1వ, 5వ తరగతిలో, ఎస్టీ విద్యార్థులకు 1వ, 5వ, 8వ తరగతుల్లో ప్రభుత్వమే ప్రవేశాలు కల్పిస్తుంది. ఒకసారి ప్రవేశం పొందితే పదో తరగతి వరకు వారి ఫీజులు చెల్లిస్తుంది. ప్రాథమిక పాఠశాల విద్యార్థికి ఏడాదికి రూ.28,000లు, ఉన్నత పాఠశాల విద్యార్థికి ఏడాదికి, వసతితో కలిపి రూ.42,000లు చెల్లిస్తుంది. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూల్ యూనిఫాం ఉచితంగా అందిస్తుంది. ఇప్పటికే ఈ స్కీమ్ కింద 17వేల మంది ఎస్సీ, 8వేల మంది ఎస్టీ విద్యార్థులు వివిధ తరగతుల్లో చదువుకుంటున్నారు.

**ఏడాదిన్నరగా చెల్లింపులు సున్నా**

బెస్ట్ అవలైబుల్ స్కీమ్‌కు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నరగా ప్రైవేటు పాఠశాలలకు రూ.210కోట్ల నిధులను చెల్లించకుండా బకాయిలు పెట్టింది. ప్రైవేట్ పాఠశాలల యజమానులు చాలాసార్లు ప్రభుత్వ పెద్దలను కలిసి, ఫీజులు చెల్లించాలని కోరారు. కానీ ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గతంలో అడ్మిషన్ పొందిన విద్యార్థులను స్కూల్స్, హాస్టల్స్ నుంచి పంపించాలని నిర్ణయించారు.

**నిధులివ్వకుంటేే అడ్మిషన్లు తీసుకోం**

బెస్ట్ అవలైబుల్ స్కీమ్ నిధులను ప్రభుత్వం బకాయి పెట్టింది. ఆర్థిక ఇబ్బందులతో పాఠశాలలను నిర్వహించలేకపోతున్నాం. ప్రభుత్వ పెద్దలను ఎన్నిసార్లు కలిసి విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం తక్షణం నిధులను విడుదల చేయకుంటే ఈ విద్యాసంవత్సరం నుంచి ఈ స్కీమ్ కింద అడ్మిషన్లను తీసుకునే ప్రసక్తేలేదు.

**-శేఖర్‌రావు, బీఏఎస్ పాఠశాలల సంఘం రాష్ట్ర కార్యదర్శి**

# తొమ్మిదేళ్లుగా 'పెండింగే'

**2015–16లోనే 56 కొత్త ఎక్సైజ్ భవనాల నిర్మాణానికి అనుమతులు**
**ఇప్పటివరకు పూర్తయినవి 18 మాత్రమే.. అందులోనూ 10 స్టేషన్లే వినియోగంలోకి**
**రూ.3 కోట్ల పెండింగ్ బిల్లులు... ఆ నిధులివ్వాలని ప్రభుత్వానికి ఎక్సైజ్ శాఖ ప్రతిపాదన**
**14 కొత్త ఎక్సైజ్ స్టేషన్ల ప్రారంభం ప్రతిసారీ వాయిదానే**

**హైదరాబాద్ జూన్ 16(సిద్దిపేట పవర్):**

ఎక్సైజ్ స్టేషన్లకు శాశ్వత భవనాల నిర్మాణం ఏళ్లకేళ్లుగా పెండింగ్‌లోనే ఉంది. 2015-16లో రాష్ట్ర వ్యాప్తంగా 56 కొత్త ఎక్సైజ్ స్టేషన్ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వాటిలో కేవలం 18 మాత్రమే పూర్తి కాగా, అందులోనూ 10 మాత్రమే వినియోగంలోనికి వచ్చాయి. ప్రతి ఎక్సైజ్ స్టేషన్ భవన నిర్మాణానికి అప్పట్లోనే రూ.40 లక్షల చొప్పున మంజూరు చేసింది.

ఇందుకుగాను రూ.20 కోట్లకు పైగా నిధులు అవసరం కాగా, అందులో కేవలం రూ.5 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. ఈ నిధులతో 18 భవనాల నిర్మాణాలు ప్రారంభం కాగా, మిగిలిన చోట్ల స్థలాల సమస్య, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం లాంటి కారణాలు అడ్డంకిగా మారాయి. అప్పట్లో నిర్మించిన భవనాలకు సంబంధించిన రూ.3 కోట్ల పెండింగ్ బిల్లులున్నాయని, వాటిని మంజూరు చేయాలని ఎక్సైజ్ శాఖ ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిసింది.

**స్టేషన్లు ప్రారంభించేదెప్పుడు?**

ఎక్సైజ్ స్టేషన్లకు భవనాల నిర్మాణం మాట అటుంచితే కొత్త ఎక్సైజ్ స్టేషన్ల ప్రారంభం ఎప్పటికప్పుడు వాయిదా పడుతూనే ఉంది. కొన్ని ఎక్సైజ్ స్టేషన్ల పరిధి చాలా ఎక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో కొత్త ఎక్సైజ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం ద్వారా, వాటి పరిధిని తగ్గించాలనే ప్రతిపాదనలు కూడా 2016లోనే వచ్చాయి. ఇందుకు సంబంధించిన జీవో కూడా అప్పుడే వెలువడింది. అప్పటి నుంచి ఎక్సైజ్ అధికారుల అలసత్వం, ప్రభుత్వ ఉదాసీనత కారణంగా ఈ స్టేషన్ల ఏర్పాటు ఆగిపోయింది. అయితే, ఇటీవల ఎక్సైజ్ అధికారులు కొంత చొరవ తీసుకొని వీటి పరిధిని నిర్ణయించడం, ఆయా స్టేషన్లకు హౌస్ ఆఫీసర్లను, సిబ్బందిని నియమించడం లాంటివి జరిగాయి.

అద్దె భవనాలు అందుబాటులో ఉంటే కొత్త స్టేషన్లను కొత్త భవనాల్లో ఏర్పాటు చేయాలని, లేదంటే పాత స్టేషన్‌లోనే కొత్త స్టేషన్‌ను కూడా నడిపించాలని ఎక్సైజ్ శాఖ ఆదేశాలిచ్చింది. దీంతో అధికారికంగానే బంజారాహిల్స్, మారేడుపల్లి, చిక్కడపల్లి, గండిపేట, కొండాపూర్, మీర్‌పేట, పెద్ద అంబర్‌పేట, కొంపల్లి, కూకట్‌పల్లి, కాప్రా, నాగారం, అల్వాల్, అమీన్‌పూర్, హసన్‌పర్తిలలో కొత్త ఎక్సైజ్ స్టేషన్లు ఏర్పాటయ్యాయి. కానీ వాటిని ప్రభుత్వం ప్రారంభించడం ఇప్పటికే పలుమార్లు వాయిదా పడింది. హైదరాబాద్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నిక కారణంతో ఒకసారి, మే, జూన్ నెలల్లో రెండుసార్లు వాయిదా పడ్డాయి. అయితే, ఇటీవల ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా ఈ నెలలోనే వాటిని ప్రారంభిస్తామని చెప్పిన నేపథ్యంలో ఇప్పుడైనా అవి అధికారికంగా ప్రారంభమవుతాయని ఎక్సైజ్ వర్గాలు ఆశిస్తున్నాయి.




# పాలిపోతున్న పచ్చదనం.. హరితహారాన్ని ఎత్తివేసిన సర్కారు

- సర్కారు నిర్లక్ష్యం.. పల్లెలకు శాపం
- వనమహోత్సవానికి మంగళం
- ఆనవాళ్లను కోల్పోతున్న నర్సరీలు
- నిధుల లేమితో నిర్వహణ కరువు
- కేసీఆర్ హయాంలో అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు విశేష కృషి

**హైదరాబాద్ జూన్ 16(సిద్దిపేట పవర్):**

కాంగ్రెస్ సర్కారు పట్టింపులేమితో పల్లెల్లో పచ్చదనం పాలిపోతున్నది. ఆకుపచ్చని తెలంగాణే లక్ష్యంగా గత సీఎం కేసీఆర్ గ్రామాలకు నెలనెలా ఇచ్చిన గ్రీన్ బడ్జెట్‌తో పచ్చలహారంగా మారిన రాష్ట్రం, ఏడాదిగా కళతప్పుతున్నది. బృహత్తర హరితహారం కార్యక్రమాన్ని ఎత్తేసి, వనమహోత్సవాన్ని చేపట్టిన ప్రభుత్వం, దానికి ఆదిలోనే మంగళంపాడింది. పంచాయతీలకు నిధులివ్వకపోవడంతో కనీసం నర్సరీలనూ నిర్వహించలేని దుస్థితి నెలకొన్నది.

కేసీఆర్ సర్కారు హయాంలో ఏటా మొక్కలు నాటి పల్లెలు, పట్టణాలను గ్రీన్‌కారిడార్‌లోకి తెచ్చేందుకు, అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు విశేషంగా కృషి చేశారు. ఫలితంగా తెలంగాణ పచ్చదనంతో పరిఢవిల్లింది. అటవీ విస్తీర్ణం పెరిగింది. పల్లె, పట్టణ ప్రకృతివనాలు, బృహత్ ప్రకృతి వనాలతో కొత్త అందాలను సంతరించుకున్నది. రెండేండ్ల క్రితం వరకు ఏ పంచాయతీ పరిధిలోని నర్సరీని చూసినా వేలాది పూలు, పండ్లు, అరుదైన జాతుల మొక్కలతో ఆహ్లాదంగా కనిపించేది. నేడు ఆ పరిస్థితులు పోయాయి.

**పంచాయతీ నిధులకు కాంగ్రెస్ బ్రేక్**

కేసీఆర్ ప్రభుత్వం గ్రీన్‌బడ్జెట్, గ్రీన్‌ఫండ్, గ్రీన్‌స్కాడ్ పేరుతో గ్రామాల్లో నర్సరీలను వృద్ధి చేసి పచ్చదనాన్ని పెంచితే.. కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు విరుద్ధమైన చర్యలు చేపడుతున్నది. పంచాయతీలకు 16 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విదిల్చడం లేదు. బీఆర్‌ఎస్ హయాంలో ఒక్కో పంచాయతీకి కేటాయించిన నిధుల్లో పది శాతం గ్రీన్‌బడ్జెట్‌కు కేటాయించేవారు. నేడు రూపాయి కూడా రాకపోవడంతో నర్సరీల నిర్వహణ కష్టంగా మారింది. వనమహోత్సవం కోసం ప్రతి పంచాయతీకి మొక్కల పెంపకం టార్గెట్ పెట్టినా నిధుల్లేక మొక్కలు తెప్పించడంపై కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు.

దూర ప్రాంతాల నుంచి మొక్కలు కొనుగోలు చేసి తీసుకురావడం ప్రయాసగా మారింది. దీంతో చాలా నర్సరీలు మొక్కలు లేకుండా కనిపిస్తున్నాయి. ఈ విషయమై పంచాయతీ అధికారులు మాట్లాడుతూ 'ఏం చేయమంటారు? ఒకప్పుడు నిధులు వచ్చేవి. గ్రీన్ బడ్జెట్ పదిశాతం ఉండేది. ఎంతైనా ఖర్చు పెట్టే అవకాశం ఉండేది. ఇప్పుడు రూపాయి కూడా రావడం లేదు. సపాయిలకే జీతాలు సరిగా ఇస్తలేం. చెత్త తరలించే ట్రాక్టర్లు, ఆటోలకు డీజిల్, కరెంట్ బిల్లులు చెల్లించలేని దుస్థితి ఉన్నది. పెన్నులు, పెన్సిల్లు, తెల్లకాగితాలు కొందామన్నా తిప్పలవుతున్నది. ఇప్పటికే జేబుల నుంచి పెట్టీపెట్టీ దుఃఖం వస్తున్నది. ఇక నర్సరీలను ఎట్లా నిర్వహించుమంటరు' అంటూ వాపోయారు.



# కేటీఆర్ కు మద్దతుగా నిలిచిన కవిత

- కేటీఆర్ పై ఏసీబీ విచారణ నేపథ్యంలో కవిత మద్దతు
- ప్రధాన సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికే విచారణలంటూ ఆరోపణ
- తమ పార్టీ నేతలు, కార్యకర్తలను అడ్డుకుంటున్నారని మండిపాటు



**హైదరాబాద్ జూన్ 16(సిద్దిపేట పవర్):**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు ఆయన సోదరి, ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మద్దతుగా నిలిచారు. ఫార్ములాఈ కార్ రేసింగ్ వ్యవహారంలో ఏసీబీ చేపట్టిన విచారణ నేపథ్యంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ విచారణ జరుగుతోందని, ప్రధాన సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు.

"ఏ పార్టీలోనైనా లోపాలుంటే అధినేత దృష్టికి తీసుకెళ్లడం సహజం. అంతమాత్రానికే దాన్ని భూతద్దంలో చూడాల్సిన పనిలేదు. మా పార్టీలోని లోపాలను మేం సరిదిద్దుకుంటాం. మాపై ఎవరైనా దాడి చేస్తే ఊరుకోబోం" అని స్పష్టం చేశారు. తమ పార్టీ కార్యకర్తలను, నేతలను బయటకు రాకుండా అడ్డుకోవడం దారుణమని ఆమె మండిపడ్డారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసాను కేవలం ఒకసారే, అదీ 60 శాతం మంది రైతులకే అందించిందని కవిత విమర్శించారు. "మిగిలిన 40 శాతం మంది రైతులకు ఎప్పుడు రైతు భరోసా ఇస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలి. గత యాసంగిలో ఇచ్చినట్లు మూడు ఎకరాల లోపు భూమి ఉన్నవారికే ఇస్తారా, లేక రైతులందరికీ వర్తింపజేస్తారా అనే దానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత కొరవడింది" అని ఆమె మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రైతులకు, ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు.

# కేటీఆర్ ఒక వ్యక్తి కాదు శక్తి

- హామీలిచ్చి మాటతప్పిన రేవంత్ రెడ్డిపై కేసు పెట్టాలి
- కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కమీషన్లను ఎత్తిచూపితే, ప్రశ్నిస్తే కేసులు
- స్థానిక ఎన్నికలకు ముందు కేసులతో చిల్లర రాజకీయాలు
- మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు

**హైదరాబాద్ జూన్ 16(సిద్దిపేట పవర్):**

రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను, చేతగానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న కేటీఆర్ పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని, మాట తప్పినందుకు ఆయనపై కేసు పెట్టాలని అన్నారు. తెలంగాణ భవన్ లో సోమవారం మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి 18 నెలల పాలనలో కేటీఆర్ పై 14 కేసులు పెట్టాడన్నారు. ఎన్ని కేసులు పెట్టినా తగ్గేదే లేదని, కేటీఆర్ ఒక వ్యక్తి కాదు శక్తి అన్నారు. దేవుళ్ళ మీద ఒట్టు పెట్టి మాట తప్పిన నిన్ను ఏం చేయాలి రేవంత్ రెడ్డి? అని ప్రశ్నించారు. కేటీఆర్ ఈ రాష్ట్ర గౌరవాన్ని పెంచే విధంగా, భారత దేశంలో అనేక రాష్ట్రాలు ఈ ఫార్ములా రేసింగ్ కోసం పోటీపడుతుంటే తన శక్తి యుక్తులను ఉపయోగించి హైదరాబాద్కు ఫార్ములా ఈ రేసును తీసుకువచ్చారన్నారు. రేవంత్ రెడ్డి మాత్రం ఏ రాష్ట్రం కూడా అందాల పోటీలు నిర్వహించమని తేల్చి చెబితే తెలంగాణలో నిర్వహించి ఈ దేశ పరువు, రాష్ట్ర పరువు తీశాడన్నారు. అందరూ కావాలన్న ఈ కార్ రేసింగ్ను తెచ్చి రాష్ట్ర గౌరవం పెంచింది బీఆర్ఎస్ ప్రభుత్వం అని స్పష్టం చేశారు. ఎవరూ ముందుకు రాని అందాల పోటీలు నిర్వహించి పరువు తీసింది రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పోవాలి కాబట్టి కేటీఆర్ పై తప్పుడు కేసులు పెట్టి చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో తుమ్మినా, దగ్గినా కేసులు పెడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కమీషన్లను ఎత్తిచూపితే కేసులు, లఘుచర్ల రైతులకు వేసిన బేడీలపై మాట్లాడితే కేసులు, ప్రశ్నిస్తే కేసులు అన్నారు. లక్షలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, కుటుంబ సభ్యుల అండ ఉన్న కేటీఆర్ ని ముట్టుకుంటే భస్మం అయిపోతారు తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు.





# కొత్త పంచాయతీల ఏర్పాటుకు బ్రేక్!.. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లూ కూడా కష్టమే!

## కేంద్రం నిర్ణయంతో తాత్కాలిక బ్రేక్

**హైదరాబాద్ జూన్ 16(సిద్దిపేట పవర్):**

రాష్ట్రంలో కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు ప్రక్రియ నిలిచినట్టే.. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఏర్పాటు కూడా ఇప్పట్లో లేనట్టే.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో వాటికి తాత్కాలికంగా బ్రేక్ పడినట్టయింది. దేశవ్యాప్తంగా జనాభా లెకలకు సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో జూన్ 30 తర్వాత చేసే ఏ భౌగోళిక పునర్వ్యవస్థీకరణను రాబోయే జనాభా లెకల కోసం పరిగణించబోమని రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. దాంతో ఈ నెల 30 తర్వాత కొత్త స్థానిక సంస్థల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయనున్నది. ఫలితంగా కొత్త పంచాయతీలు, మండలాలు, జిల్లాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఏర్పాటుకు మూడేండ్లపాటు బ్రేక్ పడనున్నది. వచ్చే 15 రోజుల్లో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో కొత్త గ్రామాలు, మున్సిపాలిటీల ఏర్పాటుకు ఆమోదం తెలపడం కష్టసాధ్యమే. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనా సౌలభ్యం కోసం 10 జిల్లాలను 33 జిల్లాలుగా ఏర్పాటు చేసింది. కొత్త మండలాలను, కొత్త మున్సిపాలిటీలను, కొత్త కార్పొరేషన్లను కూడా సృష్టించింది. కొన్ని గ్రామాలను మున్సిపాలిటీల్లో, కొన్ని మున్సిపాలిటీలను కార్పొరేషన్లలో విలీనం చేసింది.

**కొత్త గ్రామాలతో అదనపు ఆర్థికభారం**

2026 జాతీయ జనాభా లెకలను కులగణనతో సహా 2025 జూన్ 30 నాటి పరిపాలనా పటం ఆధారంగా నిర్వహిస్తారు. ఈనెల 30 ఎన్ని గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఉంటాయో వాటినే పరిగణనలోకి తీసుకుంటారు. పంచాయతీరాజ్ శాఖ వద్ద ఇప్పటికే 250కిపైగా కొత్త గ్రామ పంచాయతీల ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. 2023 శాసనసభ ఎన్నికల సమయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు ఇచ్చిన హామీలు పెద్ద సంఖ్యలో కొత్త పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయి. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. ఆర్థిక పరిమితులు, ఇప్పటికే ఉన్న మార్గదర్శకాలకు అనుగుణంగా లేని కారణంగా అనేక ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. 'కొత్త స్థానిక సంస్థల ఏర్పాటు అంటే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై అదనపు భారం. గడువు నిర్ణయించినందున, వచ్చే మూడేండ్లపాటు కొత్త స్థానిక సంస్థలు లేదా రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు సంబంధించిన ఏ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోలేము' అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలోని ఒక ఉన్నతాధికారి తెలిపారు.

**కొత్త మున్సిపాలిటీల ఏర్పాటూ కష్టమే**

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వెలుపల ఉన్న 30 పట్టణ స్థానిక సంస్థల్లో వార్డుల పునర్వ్యవస్థీకరణతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నది. ఓఆర్ఆర్ లోపల ఉన్న 13 మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో విలీనం చేసేందుకు ప్రత్యేక కసరత్తు జరుగుతున్నది. వార్డు డీలిమిటేషన్ ప్రక్రియ ఈ నెల 21 నాటికి పూర్తి కానున్నది. ఇది పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమం చేస్తుంది. ఇటీవల మూడు కొత్త కార్పొరేషన్లు, 18 కొత్త మున్సిపాలిటీలు ప్రతిపాదించబడ్డాయి. 10కి పైగా మున్సిపాలిటీల ఏర్పాటు ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే, కేంద్రం విధించిన ఆంక్షల కారణంగా, జనాభా లెకల గడువుకు ముందు కొత్త మున్సిపాలిటీలు నోటిఫై చేసే అవకాశం దాదాపుగా లేదు. ప్రస్తుతం తెలంగాణలో 16 కార్పొరేషన్లతో సహా 151 మున్సిపాలిటీలు ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక లోటు ఈ సంవత్సరం రూ.6,700 కోట్లకు చేరినట్టు తాజా ఆర్థిక నివేదికలు తెలిపాయి. ఇది కొత్త సంస్థల ఏర్పాటును కష్టతరం చేస్తున్నది.

# ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వకపోతే నాయకులను అడ్డుకుంటాం

**సంగిశెట్టి దేవదాసు**



**వలిగొండ,జూన్ 16(సిద్దిపేట పవర్ ):** వలిగొండ మండలంగోపరాజుపల్లిలోనిరుపేదలకుపూర్తిగాఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వకపోతే నాయకులను అడుగడుగునా ఊరిలోఅడ్డుకుంటామనివచ్చేఎన్నికల్లో డిపాజిట్ కూడా రాకుండా చేస్తామని వలిగొండ మాల మహానాడు నాయకుడు సంగిశెట్టి దేవదాసు అన్నారు. ఊరిలో సర్వే తప్పులతడకగా రాసుకొని పోయి విచ్చలవిడిగా చేస్తున్నారు అని అన్నారు. ఊరిలో మళ్లీ రీ సర్వే చేయాలని అన్నారు.గ్రామ ప్రజలు కొంతమంది లిస్టులో పేర్లు పెట్టుకున్నా కూడా లిస్టులో రాలేదు అని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని చెప్పి ,నిరుపేదలను అణుగతొక్కుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మించి గొంతుక కోస్తున్నారు. నిరుపేదలకు మాత్రమే ఇల్లు ఇచ్చి ప్రజలకు న్యాయం చేయాలని అన్నారు. పంచాయతీ సిబ్బంది నామ మాత్రంగా సర్వే చేసి చేతులు దులుపుకోవడం వల్ల నిరుపేదలకు ఇండ్లు దక్కడం లేదు. నాకు అసలు ఇల్లు లేనేలేదు ఉంటే నిరూపించండి ఇల్లు వస్తదని ఎదురు చూశాను కానీ నిరాశే ఎదురయ్యింది తక్షణమే అధికారులు స్పందించాలి, ఊరిలో పూరి గుడిసెలు పెంకుటి ఇండ్లు అవి దాదాపు 30 ఏళ్ల నుండి అదే విధంగా పాడైపోయి ఉన్నాయి.వర్షానికి ఎప్పుడూ ఏమైతదో అని ఆందోళన చెందుతున్నారు మొత్తమే ఇండ్లు లేని వారు ఉన్నారు వాళ్ళ పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది అధికారులు గోపరాజుపల్లి ఊరిపై స్పందించి ఇల్లు లేని వారికి పేదలకు న్యాయంచేయాలని దేవదాసు కోరారు.

## మోదీకి సైప్రస్ అత్యున్నత పురస్కారం

- సైప్రస్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన
- అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలెడెస్ తో ద్వైపాక్షిక అంశాలపై చర్చలు
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై ఇరువురు నేతల ఆందోళన
- ప్రధాని మోదీకి సైప్రస్ అత్యున్నత పౌర పురస్కారం ప్రదానం
- రక్షణ, వాణిజ్యం, సాంకేతిక రంగాల్లో సహకారంపై దృష్టి

**సైప్రస్ జూన్ 16(సిద్దిపేట పవర్):**

పశ్చిమాసియాలో, ముఖ్యంగా ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల పట్ల భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలెడెస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంతో పాటు యూరప్‌లో నెలకొన్న సంఘర్షణలు కూడా వారి చర్చల్లో ప్రస్తావనకు వచ్చాయి. ఎలాంటి సమస్యనైనా చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవడమే మార్గమని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు.

గతంలో 'ఆపరేషన్ సిందూర్' సమయంలో సీమాంతర ఉగ్రవాదంపై భారత్ సాగించిన పోరాటానికి సైప్రస్ మద్దతు పలికినందుకు ఆ దేశ అధ్యక్షుడికి ప్రధాని మోదీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైప్రస్‌లో పర్యటిస్తున్నారు. ఆదివారం సాయంత్రం లార్నాకా అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలెడెస్ సాదర స్వాగతం పలికారు. రెండు దశాబ్దాల తర్వాత భారత ప్రధాని ఒకరు సైప్రస్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీకి సైప్రస్ ప్రభుత్వం తమ దేశ అత్యున్నత పురస్కారమైన 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ మకారియోస్ 3'ను అందించి గౌరవించింది.

**ద్వైపాక్షిక సంబంధాలకు నూతనోత్తేజం**

ఇరు దేశాల అధినేతలు ద్వైపాక్షిక సంబంధాలు, పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. రక్షణ, భద్రత, వాణిజ్యం, సాంకేతికత, ఆరోగ్య సంరక్షణ, పునరుత్పాదక ఇంధన రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంపొందించుకోవడంపై వారు దృష్టి సారించినట్లు ప్రధానమంత్రి మోదీ వెల్లడించారు.

"ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలనపై ఇరు దేశాలకు ఉన్న పరస్పర విశ్వాసమే మన సంబంధాలకు బలమైన పునాది" అని మోదీ పేర్కొన్నారు. ఈ పర్యటన ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలలో ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించడానికి సువర్ణావకాశమని ఆయన అభివర్ణించారు. సైప్రస్‌కు భారత్ అత్యంత విశ్వసనీయమైన మిత్రదేశమని అన్నారు.

**సైప్రస్‌కు శుభాకాంక్షలు**

త్వరలో యూరోపియన్ యూనియన్ (ఈయూ) అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్న సైప్రస్‌కు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. సైప్రస్ నాయకత్వంలో ఈయూతో భారత్ సంబంధాలు మరింత బలపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం లభించేందుకు సైప్రస్ తన వంతుగా ఈయూ సభ్యదేశాల మద్దతు కూడగడుతుందని ఆశిస్తున్నట్లు మోదీ తెలిపారు.

సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంపైనా ఇరు నేతలు చర్చించారు. సైప్రస్‌లో యోగా, ఆయుర్వేదాలకు ఆదరణ పెరుగుతుండటం పట్ల మోదీ సంతోషం వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా భారత్‌లో పర్యటించాలని సైప్రస్ అధ్యక్షుడిని మోదీ ఆహ్వానించారు. భారతీయులకు సైప్రస్ ఒక మంచి పర్యాటక కేంద్రంగా ఉందని, ఇరు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులను ప్రారంభించే అంశంపై కూడా చర్చలు జరిగాయని ప్రధానమంత్రి మోదీ వెల్లడించారు.



## ఇదికదా ప్రజా ప్రభుత్వం అంటే

**రైతును రాజుగా చేయడమే కాదు.. వ్యవసాయాన్ని పండగా చేస్తాం..**

**రైతుల ఆశీర్వాదం ఉంటేనే పాలకుల కుర్చీలు పదిలంగా ఉంటాయి..**

**వరి వేస్తే ఉరేసుకోవాల్సిందే అని గత ప్రభుత్వాధినేత చెప్పారు..**


**రూ. 17 వేల కోట్లు మాత్రమే గత ప్రభుత్వం మాఫీ చేసింది: సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్ జూన్ 16(సిద్దిపేట పవర్):**

తెలంగాణ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా నిధులను జమ చేస్తామని తెలిపారు. ఎన్ని ఎకరాలున్నా రైతులందరికీ రైతు భరోసాను అందజేస్తామని ప్రకటించారు. 9 రోజుల్లోనే రైతులందరి అకౌంట్లలోకి రైతు భరోసా నగదు పడుతుందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఇక, రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో రైతును రాజును.. వ్యవసాయాన్నీ పండగ చేయాలనేది మా ఆలోచన అన్నారు. రైతుల ఆశీర్వాదం లేకుంటే.. అధికార పీఠం మీద కూర్చోలేరు అని తేల్చి చెప్పారు. శాసన సభ అయిన.. వార్డు మెంబరుగా గెలవాలన్నా రైతుల మద్దతు అవసరం అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

అయితే, తెలంగాణలో పదేళ్లు ప్రభుత్వాన్ని నడిపిన వాళ్ళు.. ఇప్పుడు మమ్మల్ని నిందిస్తున్నారు అని సీఎం రేవంత్ మండిపడ్డారు. రైతుల పేరుతో వీధి నాటకాలాడుతున్నారు.. లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తామని నాలుగు విడతలు చేశారు.. అప్పు కంటే వడ్డీ ఎక్కువైంది అని ఆరోపించారు. రెండో సారి అధికారంలోకి వచ్చి.. కూడా రైతులను మోసమే చేశారు.. మా ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులు ఉన్నా.. మేము అధికారంలోకి రాగానే రుణమాఫీ చేశాం అని పేర్కొన్నారు. పదేళ్లు ఆర్థిక విధ్వంసం చేసినా.. మేము ధైర్యంగా పని చేస్తున్నాన్నారు. ఇక, మేము సత్రం నడపడం లేదు.. వరి కొనమని గతంలో కేసీఆర్ చెప్పాడు.. రూ. 7 వేల కోట్లు నష్టం వచ్చింది కొనుగోలు కేంద్రాలు ఓపెన్ చేయం అని చెప్పాడు.. అవన్నీ మర్చిపోయామా?.. కానీ, మేము ముందుకు వచ్చి కొనుగోలు చేశామని ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు.

ఇక, సన్నబియ్యం పేదలకు ఇద్దాం అని చెప్పి.. సన్న వడ్లు పండిస్తే బోనస్ ఇస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. మీరు పండించిన 60 శాతం వడ్లు కొన్నాం.. రైతులు పండించిన సన్న వడ్లతో పేదల అందరూ సన్న బియ్యం తింటున్నారు.. మీకు బోనస్ ఇచ్చి ధైర్యంగా కొన్నామని పేర్కొన్నారు. అయితే, సర్పంచ్ పెండింగ్ బిల్లుల ఇవ్వలేనిది కేసీఆర్.. నేను వచ్చే నాటికి సర్పంచులు లేరు అన్నారు. 8 లక్షల 29 కోట్లు అప్పు తెచ్చాడు కేసీఆర్.. ఇన్ని అప్పులు చేసి.. రోడ్లెక్కి మాట్లాడుతున్నారు అని మండిపడ్డారు. గత ప్రభుత్వం వాయిదా పద్దతిలో ఉద్యోగులకు జీతాలు ఇచ్చే వాళ్ళు.. నేను వచ్చాకా మొదటి తేదీ జీతాలు వేస్తున్నాను అని సీఎం వెల్లడించారు.



# కేటీఆర్ సెల్ ఫోన్ సీజ్‌కు ఏసీబీ యత్నం

**మొదటిపేజీ తరువాయి**

మద్యల ఎందుకు.. నాలుగు కోట్ల మంది ముందు మాట్లాడుదామంటే పారిపోయిండు. పోనీ ఇట్ల కాదు బద్నాం క్యాంపెయిన్ ఎన్ని రోజులు నడుపుతవ్..? ఈ దేశంలో ఏ రాజకీయ నాయకుడు అడగని విధంగా నేను అంటున్నా.. నువ్వు ముందుకు రా నేను తప్పు చేయలేదు. నిజాయితీకి ధైర్యం ఎక్కువ కాబట్టి.. అవసరమైతే లై డిటెక్టర్ పరీక్ష చేయించుకుంటా.. నువ్వు కూడా రా అంటే పత్తా లేదు' మండిపడ్డారు.

**ఇది లొట్టపీసు కేసే..**

'అయినా, మళ్లీ విచారణకు వెళ్లాను. న్యాయస్థానాలపై నమ్మకం ఉన్న వ్యక్తులుగా ఎన్నిసార్లు పిలిచినా వస్తా అని చెప్పినా. పొద్దున నుంచి తొమ్మిది గంటలు ఒకటే ప్రశ్న.. అటు తిప్పి.. ఇటు తిప్పి అడుగుడు. ఇక్కడి నుంచి ఎట్టి పరిస్థితుల్లో ఫార్ములా ఈ రేస్ పోవద్దని.. మొదటి సంవత్సరం విజయవంతంగా నిర్వహించిన తర్వాత.. రెండో సంవత్సరం కూడా ఇక్కడే ఉండాలని.. ప్రభుత్వ పరంగా విధానపరమైన నిర్ణయం తీసుకున్నాం. తీసుకొని మరి కొంత డబ్బులు చెల్లించాం. ఒక్క రూపాయి కాదు పైసా అవినీతి జరుగలేదు. ఇక్కడి నుంచి పైసా పోయింది అక్కడ ఉన్నది. ఇందులో అవినీతి ఎక్కడ ఉందని ఏసీబీ అధికారులను అడిగితే సమాధానం లేదు. ఏందంటే.. ఫైల్ ఇటు పోయిందా.. ఇటుకేలి పోయిందా.. కుడిచేతిలో నుంచి ఇచ్చిన పైసలు.. ఎడమ చేతిలో నుంచి పైసలు ఇచ్చినవా.. అంటూ పనికి మాలిన ప్రశ్నలు తప్పా.. చిట్టినాయుడు రాసిచ్చిన ప్రశ్నలు తప్పా ఏం లేదు విషయం. మొన్న చెప్పినా ఇవాళ చెప్పిన.. ఇది లొట్టపీసు కేసు. ఈయన లొట్టపీసు ముఖ్యమంత్రి. వీళ్లతోని ఏది కాదు. పరిపాలన చేతకాదు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే ధైర్యం లేదు. దద్దమ్మ రాజకీయంతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. మొన్న తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్ కమిషన్ ముందుకు పిలిచారు. అంతకు ముందు హరీశ్‌రావును కమిషన్ ముందుకు పిలిచారు' అని గుర్తు చేశారు కేటీఆర్.

**రేవంత్‌కు ఉన్నది ఒకటే షోకు..**

'ఆయనకు ఒకటే షోకు. నేను నెల రోజులు జైలులో ఉన్న లుచ్చా పని చేసి.. వీళ్లను కూడా కొన్ని రోజులు జైలు పెట్టాలి అన్నదే ఆయనకున్న షోకు, పైశాచిక ఆనందం ఒక్కటే. శాడిస్టులు కొందరు ఉన్నట్లు.. నాకు దక్కనిది ఎవరికీ దక్కద్దు అన్నట్టు.. నాకు జరిగింది నీకు జరగాలి అన్నట్లుగా జైలులో పెట్టాలన్నదే షోకు. అందుకే ఇవాళ అధికారులకు నేను చెప్పిన.. మీకు పై నుంచి ఆదేశాలు రావొచ్చు ఇప్పటికే.. వస్తే పెడితే జైలులో పెట్టుకొమ్మని చెప్పాను. పదిహేను రోజులు రెస్ట్ తీసుకొని వస్తానని చెప్పాను. ఇప్పుడు మళ్లీ చెబుతున్నా.. తప్పు చేయలేదు.. తలదించుకునే పని ఎంతమాత్రం చేయలేదు. తెలంగాణ ప్రతిష్టను పెంచే పని చేశాం. తెలంగాణ ప్రతిష్టను ఆకాశం స్థాయికి తీసుకెళ్లాం తప్పా తప్పు చేయలేదు. అది కాళేశ్వరం ప్రాజెక్టు కావొచ్చు.. ఫార్ములా ఈ కావొచ్చు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం. చేయని తప్పుకు ఇవాళ కేసీఆర్, హరీశ్‌రావును పిలిచి ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. మన కార్యకర్తల, నేతల ఆత్మస్థయిర్యం దెబ్బతీసే ప్రయత్నం కమిషన్ ముందు చేస్తున్నారు. ఇక్కడ ఏసీబీ అని పెట్టి.. ఎలాంటి అవినీతి జరగని కేసులో.. అవినీతి నిరోధకశాఖను ఇన్వాల్వ్ చేశారు. మా ఆర్ఎస్ ప్రవీణ్ అన్న చెప్పిండు.. నా చరిత్రలో ఇంత తుఫేల్ కేసు ఎప్పుడూ చూడలేదు.. 26 సంవత్సరాలు ఐపీఎస్ అధికారిగా పని చేసినా.. ఇలాంటి కేసు చూడలేదన్నారు' అన్నారని కేటీఆర్ తెలిపారు.






**కేటీఆర్ సెల్‌ఫోన్స్ సీజ్?**

ఫార్ములా E కార్ రేస్ కేసులో ఏ 1గా కేటీఆర్ ఉన్నారు. నిధుల దుర్వినియోగం, విదేశీ కంపెనీకి నగదు బదిలీపై ఏసీబీ ప్రశ్నలు సంధించినట్టు సమాచారం. కేటీఆర్ సెల్ ఫోన్ సీజ్ చేసేందుకు ఏసీబీ ప్రయత్నించింది. ఇలాంటిదేదో జరుగుతుందని ముందే అంచనా వేసిన ఆయన.. విచారణకు మొబైల్ ఫోన్ తీసుకురాలేదు. తన దగ్గర ఫోన్ లేదని చెప్పారు. అయినా, అధికారులు వదలలేదు. కేటీఆర్‌కు 2 రోజులు డెడ్‌లైన్ పెట్టారు. ఫార్ములా ఈ రేసు జరిగిన సమయంలో వాడిన సెల్‌ఫోన్‌స్‌ను.. జూన్ 18లోపు అప్పగించాలని కేటీఆర్‌ను ఆదేశించారు అధికారులు. ఆ ఫోన్లు ఏసీబీ చేతికొస్తే.. ఇక అసలు గుట్టు బయటపడొచ్చు అంటున్నారు.

**15 రోజులు జైలుకు వెళతా..**

విచారణ తర్వాత తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి గాంభీర్యం ప్రదర్శించారు. ఉదయం నుంచీ తనను అడిగిన ప్రశ్నలే తిప్పి తిప్పి అడిగారని అన్నారు. అసలు ఈ కేసులో అవినీతి ఎక్కడ ఉందంటూ తానే తిరిగి ఏసీబీ అధికారులను ప్రశ్నించానని చెప్పారు. పైనుంచి రాసిచ్చిన ప్రశ్నలనే తనను అడిగారన్నారు. తనను జైల్లో పెట్టి ఆనందం పొందాలని చూస్తున్నారని.. ఓ 15 రోజులు జైలుకు వెళతా.. జైల్లో రెస్ట్ తీసుకుంటా.. అంటూ సెటైరికల్‌గా మాట్లాడారు. వందల కేసులు పెట్టినా.. జైల్లో పెట్టినా భయపడేదేలే అన్నారు కేటీఆర్.



## ఫార్ములా ఈ - రేస్ కేసులో కాంగ్రెస్ పార్టీ కుట్ర సిగ్గుచేటు.

**రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపిన పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు**

**పెద్దపల్లి,జూన్ 16,(సిద్ది పేట పవర్):** ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్ పై కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న కుట్ర సిగ్గుచేటుగా ఉందని పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. తెలంగాణ భవన్ లో సోమవారం రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపి ఆగ్రహం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని,కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కుట్రలో భాగంగా అక్రమంగా విచారణకు పిలిపించి, అరెస్ట్ చేసే ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తూ, తెలంగాణ భవన్ లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్, పెద్దపల్లి మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధు,పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి,పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గత బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం పదేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యంగా హైదరాబాద్ నగరాన్ని ఎన్నో రకాలుగా అభివృద్ధి చేసి, హైదరాబాద్ నగరాన్ని గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ పటంలో గొప్ప స్థాయిలో నిలబెట్టాలని ప్రయత్నం చేసిన కేటీఆర్ ని, నేటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అక్రమంగా,అన్యాయంగా ఫార్ములా ఈ రేస్ కేసు ద్వారా ప్రశ్నించే గొంతుకను నొక్కే ప్రయత్నం చేయడం,వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సమర్థవంతంగా ఎదుర్కొనే సత్తాలేక,అక్రమ అరెస్టులకు పాల్పడుతూ, తెలంగాణ ప్రజానీకాన్ని తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అవలంబిస్తున్న ధోరణికి నిరసనగా హైదరాబాద్ లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిరసన తెలియజేస్తూ.. కేటీఆర్ అరెస్టు అనేది జరిగితే తెలంగాణ రాష్ట్ర ప్రజలు చూస్తూ ఊరుకోరని కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి జిల్లా నాయకులు తీవ్రంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా నాయకులతో పాటు వివిధ మండలాల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆలూర్ రైతు వేదికల్లో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్

**తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి**

**ఆర్మూర్,జూన్ 16(సిద్ది పేట పవర్):**

ఆలూర్ మండల కేంద్రంలో రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్ లో రైతులు సోమవారం సాయంత్రం పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలూర్ రైతు వేదిక లో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్ లో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని ఆయన స్థానిక రైతులతో కలిసి వీక్షించారు.ఈ కార్యక్రమంలో ఏవో రాంబాబు, ఏడిఏ విజయలక్ష్మి,ముక్కెర విజయ్,వైస్ మల్లారెడ్డి, జితేందర్,భోజరెడ్డి,రైతులు తదితరులు పాల్గొన్నారు.



## కేటీఆర్ జైలుకు వెళ్లాలని కుతూహలంగా ఉన్నారు..





- కవిత జైలుకెళ్లి బీసీ ఎజెండా ఎత్తుకున్నారన్న సీతక్క
- కేటీఆర్ కూడా జైలుకి వెళ్లాలనుకుంటున్నారని ఎద్దేవా
- తోడేళ్లలా దోచుకుని వినయం నటిస్తున్నారని మండిపాటు

**హైదరాబాద్ జూన్ 16(సిద్దిపేట పవర్):**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు జైలుకు వెళ్లాలని కుతూహలంగా ఉన్నట్లు కనిపిస్తోందని రాష్ట్ర మంత్రి సీతక్క ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో ఏసీబీ విచారణకు హాజరయ్యే ముందు కేటీఆర్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆమె ఈ విధంగా స్పందించారు.

వీలైనంత త్వరగా జైలుకు వెళ్లేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేటీఆర్ రెచ్చగొడుతున్నారని సీతక్క అన్నారు. "కల్వకుంట్ల కవిత జైలుకు వెళ్లివచ్చి బీసీ ఎజెండాను అందుకున్నారు. తాను వెనుకబడ్డాననే భావనతో కేటీఆర్ కూడా జైలుకు వెళ్లి ఏదైనా పథకం రచించాలని అనుకుంటున్నారేమో" అంటూ వ్యంగ్యంగా అన్నారు. కేటీఆర్ మాటల్లో పొగరు కనిపిస్తోందని ఆమె మండిపడ్డారు. ఏదో ఆశించే కేటీఆర్ జైలుకు వెళ్లాలని అనుకుంటున్నారని, తోడేళ్లలా దోచుకుని ఇప్పుడు వినయం నటిస్తున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. "కేటీఆర్ పొగరుతో మాట్లాడుతుంటే, మా ముఖ్యమంత్రి పౌరుషంతో మాట్లాడుతున్నారు" అని సీతక్క వ్యాఖ్యానించారు. కేటీఆర్ వ్యవహారాన్ని దర్యాప్తు సంస్థలే చూసుకుంటాయని ఆమె స్పష్టం చేశారు.

మరోవైపు, ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో భాగంగా కేటీఆర్ ఏసీబీ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. విచారణకు వెళ్లేముందు ఆయన ఒక ట్వీట్ చేశారు. ఇప్పటికే మూడుసార్లు విచారణకు పిలిచారని, ముప్పైసార్లు పిలిచినా తాను హాజరవుతానని అందులో పేర్కొన్నారు. తనను ఏసీబీ విచారణకు పిలిచి కొందరు రాక్షసానందం పొందుతున్నారని, అవసరమైతే తనను అరెస్టు కూడా చేసుకోవచ్చని కేటీఆర్ సవాల్ విసిరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తాను జైలుకు వెళ్లి వచ్చానని, తనకు జైళ్లు, కేసులు కొత్తేమీ కాదని ఆయన తన ట్వీట్‌లో తెలిపారు. కేటీఆర్ జైలు గురించి చేసిన ఈ వ్యాఖ్యలపైనే మంత్రి సీతక్క పైవిధంగా స్పందించారు.

## విశాఖ నూతన జీవీఎంసీ కమిషనర్ గా కేతన్ గార్గ్..

**విశాఖపట్నం,జూన్ 16(సిద్దిపేట పవర్):**



గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్ గా 2018 ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన కేతన్ గార్గ్ ను నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్నారు. కేతన్ గార్గ్ బదిలీతో ఖాళీ అయిన రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ స్థానాన్ని తదుపరి ఉత్తరువులు ఇచ్చేవరకు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పూర్తి అదనపు బాధ్యతలతో అప్పగించారు. గతంలో జీవీఎంసీ కమిషనర్ గా విధులు నిర్వహించిన పి.సంపత్ కుమార్ 2025 జనవరి 20 బదిలీ కావడంతో అప్పటినుండి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం ఎన్ హరేంద్ర ప్రసాద్ జీవీఎంసీ కమిషనర్ గా అదనపు బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం దాదాపు ఐదు నెలల తర్వాత జీవీఎంసీ పూర్తిస్థాయి కమిషనర్ ను నియమించింది..



## రైతు బంధావుడు సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం

- గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి
- గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ సర్ధార్ ఖాన్

**సిద్దిపేట గజ్వేల్ నియోజకవర్గం :**గజ్వేల్ పట్టణం లోని రైతు వేదికలో ప్రజా ప్రభుత్వ అధినేత రైతు బాంధవుడు రేవంత్ రెడ్డికి గజ్వేల్ ఏఎంసీ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ సర్ధార్ ఖాన్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ రైతులకు రైతు భరోసా విడుదల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను కడుపు లో పెట్టుకొని చూసుకుంటుందని తెలిపారు. రైతులకు ఏ కష్టం రానివ్వకుండ పెట్టుబడి సహాయం రేవంత్ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని దిమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో డైరెక్టర్ యాదయ్య జిల్లా కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి అజ్మార్ ఊడెం శ్రీనివాస్ రెడ్డి అరుణ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## రైతు నేస్తం కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం

**ఎంపీడీఓ రామిరెడ్డి, ఎం. ఓ వసంత రావు**

**సిద్ధి పేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :**జగదేవపూర్ మండలంలోని జగదేవపూర్ మునిగడప తీగుల్ రైతు వేదికల ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు నేస్తం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మండలంలోని రైతులు ప్రత్యక్షంగా వీక్షించారు. రైతు నేస్తం కార్యక్రమం ఎం. ఓ వసంత రావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమనికి ఎంపీడీఓ రామిరెడ్డి ముఖ్యతిధిగా హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో జగదేవపూర్ ఎంపీడీవో రామి రెడ్డి మునిగడప నుండి ఎంపీఓ ఖాజా మొహిద్దిన్ , తీగుల్ నుండి మండల వ్యవసాయ అధికారి వసంతరావు సంబంధిత సంబంధిత ఏఈవో లు రైతులు తదితరులు పాల్గొన్నారు.



## గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ ఆశీస్సులు తీసుకున్న రమేష్

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** గజ్వేల్ పట్టణం లోని సమికృత మార్కెట్ లో గజ్వేల్ మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రమేష్ జన్మదిన ం సందర్భంగా గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ సర్ధార్ ఖాన్ ఆశీర్వదిస్తూ కేక్ కట్ చేశారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ గజ్వేల్ మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రమేష్ అష్ట ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని కోరుకుంటున్నామని తెలిపారు . ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కష్టపడి పని చేసిన వారికీ కాంగ్రెస్ పార్టీ లో గుర్తింపు ఉంటుందని తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాదించాలని కోరారు. ఈ కార్యక్రమం లో గాజ్వేల్ మునిసిపల్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు జిల్లా కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి ఎండీ అజ్మార్ ఊడెం శ్రీనివాస్ రెడ్డి అసెంబ్లీ అధ్యక్షులు అజ్జర్ అరుణ్ సీనియర్ నాయకులు రఫ్ బాయ్ తదితరులు ఉన్నా రు.

## ప్రతీ ప్రార్థన, ప్రతీ పూజ పల్లా కోసమే

**మానవత్వం ఉన్న పల్లా కోసం మతాలకతీతంగా ప్రార్థన లు, పూజలు**

**చేర్యాల, జూన్ 16 ( సిద్ధిపేట పవర్)** చేర్యాల మండల బి.ఆర్.ఎస్ నాయకులు పల్లా ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని ప్రధాన కార్యదర్శి కోతి దాసు ఆధ్వర్యంలో మెదక్ చర్చ్ కి వెళ్లి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.. శనిగరం లక్ష్మణ్ ఆధ్వర్యంలో శామీర్ పేట కట్ట మైసమ్మ దగ్గర మరికొందరు పూజలు నిర్వహించారు..వారు మాట్లాడుతూ పల్లా ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని, వారు త్వరగా ప్రజలలో మునుపటి లాగా తిరగాలని తెలియజేశారు...నిన్న పల్లా మాట్లాడుతూ రెండు వారాల వరకు డాక్టర్ లు విశ్రాంతి తీసుకోవాలని సూచించారని ఆయన ను కలవడానికి ఎవరు కూడా రావొద్దు అని విజ్ఞప్తి చేశారు, పల్లా మాటను ఆయన సైనికులుగా మేము శిరసావహిస్తామని తెలిపారు...కార్యక్రమంలో వీరితో పాటు యూత్ అధ్యక్షులు రాజేష్ గౌడ్, సోషల్ మీడియా అధ్యక్షులు బంగారిగల్ల కిరణ్, కన్నెబోయిన శ్రీనివాస్, ఎర్రోళ్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు..






# రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం.

**జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల తీరు పై భారత ప్రభుత్వ NREGS డైరెక్టర్ శివశంకర్ తో చర్చించిన జిల్లా కలెక్టర్ కె హేమావతి.**

జిల్లాలో ఈరోజు, రేపు, ఎల్లుండి 3 రోజుల పాటు MNREGS పనుల పరిశీలనలో భాగంగా సోమవారం కేంద్ర ప్రభుత్వ MNREGS డైరెక్టర్ శివ శంకర్ నేతృత్వంలోని బృందం కుకునూరు పల్లి మండలంలోని ముద్దాపూర్, కుకునూరుపల్లి మరియు కొండపాక గ్రామంలో లలో పర్యటించి ముద్దాపూర్ లో ఫిష్ పాండ్, కుకునూర్ పల్లి లో భూమి చదును పనులు, కొండపాకలో భూమి చదును మరియు మొరం రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం మినర్వా హోటల్ లో జిల్లా కలెక్టర్ కే. హైమావతి తో జిల్లాలో పర్యటించిన సందర్భంగా పరిశీలించిన నరేగా ద్వారా చేపట్టిన వివిధ పనుల ప్రగతి పై చర్చించారు. ఈరోజు పరిశీలించిన పనులు సంతృప్తికరంగా ఉన్నాయని పనులన్నీ కూడా ప్రయోజనకరంగా ఉంటాయని ఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చేర్యాల పెయింటింగ్స్ ను జిల్లా కలెక్టర్ ఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ కు అందజేశారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గరీమ అగ్రవాల్, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య తదితరులు ఉన్నారు.









## గృహ కార్మికుల సంక్షేమానికి చట్టాన్ని రూపొందించాలి.

**డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన**


**సిద్ధిపేట, జూన్ 16(సిద్ధిపేట పవర్):**గృహ కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన డిమాండ్ చేశారు. డిబిఎఫ్ అధ్వర్యంలో సోమవారంనాడు 14వ అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవాన్ని సిద్దిపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన మాట్లాడుతూ గృహ కార్మికుల సంక్షేమానికి చట్టం రూపొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించిన పట్టించుకోవడం లేదన్నారు.ప్రజా పాలనలో గృహ కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని ఇచ్చిన హమిలను సియం రేవంత్ రెడ్డి నిలబెట్టుకొవాలన్నారు.తెలంగాణ రాష్ట్రంలో 11 లక్షల గృహకార్మికులు వున్నారని వీరంతా ఎస్సీ ఎస్టీ బిసి మైనారిటీలేనని చెప్పారు.గృహ కార్మికులకు కనీస వేతనాలు అందక శ్రమ దోపిడికి గురవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చట్టం చెయాలన్నారు. కేరళ,మహరాష్ట్ర,తమిళనాడు తరహాలో తెలంగాణ లో గృహ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు.ఆదివారంనాడు సెలవు ఇవ్వాలని, పెన్షన్ ఇవ్వాలని గృహ కార్మికులను కార్మకులుగా గుర్తించి సామాజిక భద్రత కల్పించాలన్నారు.గృహ కార్మికుల పై లైంగిక వేధింపులు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. దళిత మహిళ మరియమ్మను దొంగతనం పేరుతో లాకప్ డెత్ కు గురిచేశారని ప్రజా పాలనలో షాద్‌నగర్ లో గృహ కార్మికురాలైన దళిత. మహిళ సునీతను లాకప్ చిత్రహింసలకు గురి చేసారని అవేదన వ్యక్తం చేశారు. గృహ కార్మికుల కు డబుల్ బెడ్ రూమ్ లు,ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు.గృహ కార్మకుల హక్కుల పరిరక్షణకు సంఘటిత ఉద్యమాలు చేయాలన్నారు .ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ నాయకులు ఉమక్క,శారద,సునీత,మీనా తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ పాఠశాలలు అద్భుతంగా తీర్చి దిద్దుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.

**ఎన్ .ఎస్.యు.ఐ జిల్లా ఉపాధ్యక్షులు యండి.అజ్మత్ అలీ**

**సిద్ధిపేట ,జూన్16( సిద్ధిపేటపవర్):**ప్రభుత్వ పాఠశాలలో అద్భుతంగా తీర్చిదిద్దుతున్న కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్.ఎస్.యు.ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి .అజ్మత్ అలీ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వ పాఠశాలను పూనా ప్రారంభమైన రోజునుండే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు యూనిఫామ్లో అందజేయడం ప్రజాపాలన సంకేతం విద్యార్థులను ఉన్నంత విద్యలు చదువుకోవడమే ప్రభుత్వ లక్ష్యం అనే కొని ఆడారు.ఈ కార్యక్రమంలోఎన్ .ఎస్ .యు .ఐ టౌన్ అధ్యక్షులు సాయి ప్రతాప్, ఎన్ .ఎస్ .యు .ఐ నాయకులు ప్రవీణ్ ముదిరాజ్, కే.మధు తదితరులు పాల్గొన్నారు




## విశ్వకర్మ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**అఖిల భారత విశ్వకర్మ పరిషత్ జిల్లా అధ్యక్షులు బాసంపల్లి నరసింహ చారి**

**సిద్ధిపేట, జూన్ 16:** విశ్వకర్మ వృత్తుల అభివృద్ధి కోసం విశ్వకర్మ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులు కేటాయించాలని అఖిల భారత విశ్వకర్మ పరిషత్ జిల్లా అధ్యక్షులు బాసంపల్లి నరసింహ చారి, గాయత్రి విశ్వకర్మ సంఘం అధ్యక్షులు యాదగిరి చారి అన్నారు. సిద్ధిపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ నాయకులు మాట్లాడారు. విశ్వకర్మల అభివృద్ధి కోసం అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ ఏర్పాటు చేసి పోరాటం చేస్తున్నామని తెలిపారు. సంఘాన్ని బలోపేతం చేసేందుకు సిద్ధిపేట జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే కోహెడ మండల సంఘం అధ్యక్షునిగా రవీంద్ర చారి ని నియమించినట్లు తెలిపారు. ప్రభుత్వం విశ్వకర్మ వృత్తుల వారికి అందిస్తున్న 25 హెచ్పి ల విద్యుత్తు పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకం ప్రకారం నాలుగు రూపాయలకే యూనిట్ విద్యుత్తు విశ్వకర్మలకు లభిస్తుంది అన్నారు. నూతనంగా ఎన్నికైన కోహెడ మండల సంఘ కమిటీకి గాయత్రీ విశ్వకర్మ సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాజేశం, వేణుగోపాల్, నారాయణ, శ్రీకాంత్, బాలయ్య పలువురు పాల్గొన్నారు.



## ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

**నంగునూరు, జూన్ 16 (సిద్ధిపేట పవర్)**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నాగరాజుపల్లి గ్రామంలో లో ప్రమాదవశాత్తు ఒక వ్యక్తి బావిలో పడి మృతి చెందాడు. సోమవారం జరిగిన ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది. నాగరాజుపల్లి గ్రామానికి చెందిన ముక్కెర రాజయ్య అనే వ్యక్తి వ్యవసాయ పనుల నిమిత్తం తన బావి దగ్గరకు వెళ్ళాడు. ఈ క్రమంలో తాను కాలు జారి బావిలో పడిపోయినట్లు ఆనవాళ్లను బట్టి గుర్తించారు. వ్యవసాయ బావిలో మృతుడి చెప్పులు కనిపించడంతో రాజయ్య బావిలో పడినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రాజగోపాల్ పేట ఎస్సై ఎండీ ఆసిఫ్ పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని బావిలో గాలింపు చర్యలు చేపట్టారు. దాదాపు రెండు గంటల గాలింపు చర్యల అనంతరం ముక్కెర రాజయ్య మృతదేహాన్ని బావిలో నుంచి వెలికి తీశారు. మృతునికి భార్య సత్తవ్వ, ముగ్గురు కూతుర్లు రమ్య, కోమల, అనితతో పాటు కుమారుడు అనిల్ ఉన్నారు. ముక్కెర రాజయ్య ప్రమాదవశాత్తు మృతి చెందడంతో నాగరాజుపల్లి గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం సిద్ధిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు రాజగోపాల్ పేట పోలీసులు.



# బీసీల్లో రాజకీయ చైతన్యం రావాలి





- **బీసీలు రాజకీయంగా చాలా వెనుకబడి పోతున్నారు.**
- **అవకాశం వస్తే ఐక్యంగా ముదిరాజ్ కులాభివృద్ధికి పాటుపడండి..**
- **ముదిరాజులు రాజకీయ చైతన్యంతో ముందుకు సాగాలి..**
- **ముదిరాజ్ హాస్టల్ భవన ప్రహరి గోడకు 20 లక్షల నిధులు మంజూరు.**
- **మెదక్ ఎంపీ రఘునందన్ రావు...**

**సిద్దిపేట పవర్ ప్రతినిధి:**

బిజెపి పార్టీ చెప్పిన హామీలు నెరవేర్చే విధంగా పనిచేస్తుందని వచ్చే ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. సోమవారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల సమీపంలోని ముదిరాజ్ హాస్టల్ భవనం ప్రహరి గోడకు 20 లక్షల నిధులను మంజూరు చేస్తూ ప్రహరి గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు బీసీలను ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే ఎన్నికల నిర్వహణకు వెళ్లాలని అన్నారు. బిజెపికి అవకాశం వస్తే బీసీ బిడ్డను మూడుసార్లు దేశ ప్రధానిగా చేశామని రాష్ట్రపతిగా మహిళలను చేశామని తెలిపారు. ముదిరాజులు కూడా అవకాశం వస్తే ఐక్యంగా అభివృద్ధికి పాటుపడాలని ముదిరాజుల సత్తా ఏంటో చాటాలని తెలిపారు. భవన నిర్మాణాలు కళాశాల నిర్మాణాలు కాకుండా రాజకీయంగా ముదిరాజులు చైతన్యం కావాలని ఇంకా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అందరూ ఆశీర్వదిస్తేనే మెదక్ ఎంపీగా గెలుపొందానని తప్పకుండా ఇక్కడి ప్రజలకు తన వంతుగా సహకరిస్తానని తెలిపారు. బీసీల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం కులగనన చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కులగనన చేసిందని దాని ప్రకారమే ఎన్నికల్లో రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. దుబ్బాక నియోజకవర్గం లో నాలుగు మండలాలకు ముదిరాజ్ కులస్తులనే అధ్యక్షులుగా ఎన్నుకున్నామని బిజెపి పార్టీ ముదిరాజులకు సముచిత స్థానం ఇచ్చిందని అన్నారు. ప్రస్తుత బిజెపి జిల్లా అధ్యక్షుడిగా ముదిరాజ్ కులస్తుడిని నియమించుకున్నామని తెలిపారు. ముదిరాజ్ కులస్తులకు రాజకీయంలో అవకాశం వస్తే ఒక తాటిపై నిలబడి గెలిపించుకోవాలని రాజకీయ ఐక్యమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్,ముదిరాజ్ కుల పెద్దలు బాల్ రంగం, బిజెపి నాయకులు దూది శ్రీకాంత్ రెడ్డి, బాసం గారి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ అంటే రైతాంగానికి అండ

- **భూంపల్లి రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి**
- **9000 కోట్లు రైతు భరోసనిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి**
- **రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పిటిసిలు, ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి**

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ జూన్ 16**

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1034 రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం కార్యక్రమాన్ని ప్రారంభోత్సవం చేయడం జరిగింది. అక్బర్ పేట భూంపల్లి మండలంలోని భూంపల్లి రైతు వేదికలో జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి గారు. ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 9000 కోట్ల రూపాయలు రైతు భరోసా నిధులు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పిటిసిలు, ఎంపీటీసీలు గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు వినిపించారు. చేశారు. మూడున్నర సంవత్సరాలు ప్రజా ప్రభుత్వం ఉంటుంది కనుక ప్రజలు మేలు చేసే అనేక కార్యక్రమాలను దుబ్బాక నియోజకవర్గం లో చేపడుతామని తెలిపారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాతి అని 25 లక్షల మంది రైతులకు ఏకకాలంలో 21,000 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానికి అని తెలిపారు. రైతులకు రైతు భరోసా కింద ఎకరానికి 12 వేల రూపాయలను ఇస్తుందని అలాగే భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా 12 వేల రూపాయలు ఇస్తుందని తెలిపారు. రైతులు పండించిన సన్న వడ్లకు 500 రూపాయలు బోనస్ ఇస్తుందని తెలియజేశారు. ఆ సన్న వడ్లను బియ్యంగా మార్చి పేద ప్రజలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు సన్న బియ్యం ఇస్తున్నది తెలంగాణ ప్రజా ప్రభుత్వమని రైతులు పండించాలని ఈ సందర్భంగా రైతులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, జిల్లా కార్యదర్శి ఏలూరి కమలాకర్, మాజీ ఎంపీటీసీలు అబ్బుల ఉమారాణి బాలా గౌడ్, మంద చంద్ర సాగర్, పాతూరి శ్రీనివాస్ గౌడ్, మండల నర్సింలు, మాజీ సర్పంచులు గుండా శంకర్, పోతారం అనసూయ ప్రతాప్, పెరిక మధు, మండల ప్రధాన కార్యదర్శి కోనపురం బాలు యాదవ్, మహిళా అధ్యక్షురాలు కూతురి సుమలత, ఫిషర్మెన్ మండల అధ్యక్షులు అన్నబోయిన చంద్రశేఖర్, ఆత్మ కమిటీ డైరెక్టర్లు షేర్ పల్లి స్వామి, ఎర్రోళ్ల స్వప్న బాలరాజు, కూడవెల్లి డైరెక్టర్లు వెలుపుల యాదగిరి ముదిరాజ్, పుదోజి ప్రభాకర్ చారి, కడవెరుగు నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల్తే వెంకటేశం, ఎల్లన సురేందర్ రెడ్డి, కడవెరుగు రమేష్, కడవెలుగు జగన్, బొమ్మల శ్రీధర్, నాయకులు మరియు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## మంత్రి వాకిటి శ్రీహరిని కలిసిన నీలం మధు ముదిరాజ్

**ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని శాలువాలతో సత్కరించుకున్న ఇరువురు**

**సిద్దిపేట పవర్, సిద్దిపేట అర్బన్:** నూతన మంత్రిగా ఇటీవల ప్రమాణస్వీకారం చేసిన పశు సంవర్ధక, మత్స్య, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని నీలం మధు ముదిరాజ్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించనున్న సందర్భంగా హైదరాబాద్ ఆరామ్ గర్లోనని మంత్రి నివాసంలో ఆయనను కలిసి పూల బొకే అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నీలం మధుని మంత్రి ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ఆలింగనం చేసుకుని సాదరంగా ఆహ్వానించి ఇరువురు శాలువలతో సత్కరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక న్యాయాన్ని అమలు చేస్తూ అన్ని వర్గాలకు ప్రాధాన్యత కల్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి అందరం కలిసికట్టుగా పనిచేస్తూ మన వర్గాల సమస్యలు,ఆర్థికాభివృద్ధి, రాజకీయ అవకాశాలకు కృషి చేద్దామని చర్చించుకున్నారు.





## కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామి వారికి ప్రత్యేక పూజలు

**పల్లా కోలుకోవాలని పెద్ద పట్నం వేయించిన బి ఆర్ ఎస్ నాయకులు**

**చేర్యాల, జూన్ 16 (సిద్దిపేట పవర్)** BRS రాష్ట్ర నాయకులు ముత్యాల బాల నర్సయ్య ఆధ్వర్యంలో చేర్యాల,కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసి పెద్ద పట్నం వేయించారు.. మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌస్లో ప్రమాదవశాత్తు గాయపడిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి త్వరగా కోలుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారికి పెద్ద పట్నం వేసి,ప్రత్యేక పూజలు నిర్వహించారు...ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరంపై కమీషన్ విచారణకు హాజరవుతున్న సమయంలో మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌస్లో ప్రమాదవశాత్తు గాయపడడంతో యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని అన్నారు...ప్రమాదవశాత్తు గాయపడిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి త్వరగా కోలుకుని ప్రజల్లోకి రావాలని కోరుకుంటూ కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు

## ప్రైవేట్ పాఠశాల పై చర్యలేవి

**ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోని వైనం..**

**చేర్యాల, జూన్ 16 (సిద్దిపేట పవర్)** ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా గత మూడు సంవత్సరముల నుండి చేర్యాల ప్రాంతంలో కార్పొరేట్ శ్రీ చైతన్య పాఠశాల నడుస్తున్న విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన స్పందన కరువైందని ఏలాంటి అనుమతులు పొందకుండా విద్యార్థుల నుండి వేలకు వేల ఫీజులు వసూలు చేస్తూ ప్రభుత్వాన్ని విద్యాశాఖను తప్పుదోవ పట్టిస్తున్న శ్రీ చైతన్య పాఠశాల ను వెంటనే మూసివేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ గారికి అఖిల భారత విద్యార్థి సమాఖ్య AISF సిద్దిపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల నరేష్ ఫిర్యాదు చేయడం జరిగింది... ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు లేకుండా వెలవెలబోతున్నాయని కార్పొరేట్ పాఠశాలలను ప్రోత్సహించే విధంగా విద్యా వ్యాపారాన్ని ప్రోత్సహించే విధంగా విద్యాశాఖ అధికారుల చర్యలు ఉన్నాయని అన్నారు నూతన కలెక్టర్ గారికి శ్రీ చైతన్య పాఠశాలను వెంటనే మూసివేసి ఆ పాఠశాలలో ఉన్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని దరఖాస్తు ద్వారా కోరారు వెంటనే పాఠశాల యాజమాన్యంపై ఆ పాఠశాలకు సంబంధించిన స్కూల్ బస్సులను సీజ్ చేసి ఇన్ని సంవత్సరాలుగా విద్యార్థుల నుండి వసూలు చేసిన ఫీజులను వారి కి తిరిగి చెల్లించే విధంగా చర్యలు తీసుకొని వారిపై చట్టపరమైన చీటింగ్ కేసును నమోదు చేసి వెంటనే పాఠశాలను మూసివేయాలని కోరడం జరిగింది.



## ఆత్మీయ మిత్ర బృంద ఆధ్వర్యంలో విద్యార్థులకు టై బెల్టులు అందజేత




**చిన్నకోడూరు జూన్ 16(సిద్దిపేట పవర్):** మండల పరిధి కమ్మర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆత్మీయ మిత్ర బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు టైప్ బెల్టులు అందజేయడం జరిగిందని ఆత్మీయ మిత్ర బృందం .అధ్యక్షులు శంకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నంత స్థితికి ఎగరాలని సూచించారు. దేశ రాష్ట్ర భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని గుర్తు చేశారు. ఆత్మీయ మిత్ర బృందం ఎల్లవేళలా విద్యార్థులకు అండగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మిత్ర బృందం సభ్యులు శ్రీనివాస్ ,శంకర్ ,ప్రకాష్, ఉపాధ్యాయులు రేణుక ,మమత, రేణుక తదితరులు పాల్గొన్నారు.



## పార్టీకోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుంది

**మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిని సన్మానించిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్**

**చిన్నకోడూర్, జూన్ 16(సిద్దిపేట పవర్):** మండల కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలిగా నూతనంగా నియమకమైన. చెర్లంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సింగిరాల లక్ష్మి మండల కాంగ్రెస్ అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ శాలువాతో ఘనంగా సన్మానించారు .ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పార్టీ క్లిష్ట పరిస్థితిలో పార్టీకోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు సరైన సమయంలో గుర్తింపు దక్కుతుందన్నారు అంతే కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీలు. కోటి మంది మహిళలను కోటిశ్వరులను చేయాలనే ముఖ్యమంత్రి సంకల్పన్నీ ప్రజల్లోకి తీసుకువెళ్లి వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సింగిరాల లక్ష్మి మాట్లాడుతూ తన నియామకానికి సహాకరించిన నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ పూజల హరికృష్ణ కు, జిల్లా మహిళ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి , చిన్నకోడూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు మీసం.మహేందర్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మండల ఉపాధ్యక్షులు సందబోయిన పర్షరాం,వికలాంగుల విభాగం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సింగిరాల .రాజు, సెల్ జిల్లా కన్వీనర్ పొన్నాల.రాజేష్, మండల కన్వీనర్ కొమ్ము. ప్రశాంత్, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు ఉడుత. జయంత్, ఎస్సీ సెల్ మాజీ మండల అధ్యక్షులు నముండ్ల. వినోద్,నాయకులు జక్కుల.నాగరాజు,ద్యావ. రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించొద్దు...

**85 దరఖాస్తులు స్వీకరణ**
**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్...**

**మెదక్(సిద్దిపేట పవర్) ప్రతినిధి** ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించరాదని *జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం, కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు ఇతర జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మొత్తం 85 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.భూ సమస్యలు 36, పింఛన్లు 02 ఇందిరమ్మ ఇండ్లు 17, ఇతర సమస్యలు 30 మొత్తం 85 వివిధ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్న వారి అర్జీలను పరిశీలించి, వెంటనే పరిష్కరించాలన్నారు. అలాగే మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి సోమవారం తప్పనిసరిగా నిర్వహించాలని, అందుకు తగ్గట్లుగా ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు...

